కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం


సత్కరిస్తున్న మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా యూత్ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన షేక్ ఉమర్ ముక్తదార్ ను, బహదూర్‌పురా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్‌ను గురువారం ఆయన సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులందరికీ ఇప్పిస్తామన్నారు. అనంతరం షేక్ ఉమర్ ముక్తదార్, అబ్దుల్ ఫయాజ్ ఓటింగ్ ద్వారా తమను గెలిపించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


లంగర్‌హౌస్ రామాలయం వద్ద నిరసనలో బీజేపీ నాయకులు

లంగర్‌హౌస్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని గోల్కొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్ అన్నారు. కాంగ్రెస్ ఏడాది వైఫల్య పాలనపై బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు లంగర్‌హౌస్ బాపూఘట్ రామాలయం నుంచి గురువారం నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే నిరుపేదల ఇళ్లు ఖాళీ చేయించి మూసీ ప్రక్షాళన అంటూ భారీ అవినీతికి సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే తెలంగాణలో కాంగ్రెస్ మాత్రం అప్పుల ఊబిలో నిండా మునిగిపోయిందన్నారు. కార్యక్రమంలో జాతీయ ఎస్సీ మోర్చా కార్యదర్శి ఎస్.కుమార్, బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, లంగర్‌హౌస్ మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, నాగేంద్రప్రకాశ్‌రెడ్డి, గోవర్ధన్, జీ సునీల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

బస్తీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు


హకీంపేట్ జియా స్కూల్ లేన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: బస్తీల రూపురేఖలు మార్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీల్లోని ఇరుకైన రోడ్లను విస్తరించడంతో పాటు రోడ్లపై రాకపోకలకు అడ్డంగా ఉన్న బోర్లు, నల్లాలను వేరే చోట అమర్చుతామన్నారు. హకీంపేట్‌లోని జియా స్కూల్ లేన్, ఎస్ఎస్ఎఫ్ కాలనీలోని నూతన విద్యుత్ స్తంభాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు మజీద్‌ఖాన్, ఆలీముద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ అలీ తదితరులు ఉన్నారు.

జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌పై చర్యలు తీసుకోండి


జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి మెమోరాండం అందజేస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

అబిడ్స్: జీహెచ్ఎంసీ నాలుగో సర్కిల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు ప్రమాదానికి కారకులైన డిప్యూటీ కమిషనర్ విస్లావత్ సేవా నాయక్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మెమోరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విస్లావత్ సేవా నాయక్ వేధింపులతోనే ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు యాక్సిడెంట్‌కు గురై యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. వెంటనే డిప్యూటీ కమిషనర్‌పై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కుతుబ్‌షాహీ ప్రాంగణం పరిశీలన


కుతుబ్‌షాహీ ప్రాంగణం పరిసరాలు పరిశీలిస్తున్న ఏడీ రవీంద్రనాయక్

గోల్కొండ: కుతుబ్‌షాహీ సమాధుల ప్రాంగణంలోని కుతుబ్‌షాహీ మసీదు పరిసరాలను రాష్ట్ర ఆర్కియాలజీ, పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాధుల ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తాచెదారం వేస్తున్నారని గేట్ వద్ద ఉండే సెక్యూరిటీ సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని సూచించారు. మసీదు ప్రతినిధి మిర్జా ఎక్బాల్ అహ్మద్ మాట్లాడుతూ మసీదు ప్రాంగణంలో చెత్తాచెదారంతో పాటు మట్టి కుప్పలు ఉన్నాయని దీన్నివల్ల సమాజ్‌కు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ మసీదు ప్రాంగణంతో పాటు ఇతర ప్రాంతాల్లోని వ్యర్థాలు, మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తైలవర్ణ చిత్రపటం ఏర్పాటు చేయాలి


సాహిత్య అకాడమీ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో తెలంగాణ సాహితీ కీర్తి కిరీటం కపిలవాయి లింగమూర్తి తైలవర్ణ చిత్రపటం ఏర్పాటు చేయాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం కోరింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారికి గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. సుప్రసిద్ధ కవి, రచయిత అయినటువంటి కపిలవాయి లింగమూర్తి వివరాలను సమగ్రంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కపిలవాయి లింగమూర్తి తనయుడు కపిలవాయి అశోక్‌బాబు, మాతృ సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు కోశాధికారి రాగఫణి రవీంద్రచారి, వివిధ జిల్లాల అధ్యక్ష ,కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి


క్రీడాకారులను అభినందిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ ఎండీ బాలాదేవి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని స్పోర్ట్స్ అథారిటి ఎండీ ఎ.సోని బాలదేవి ఆకాంక్షించారు. ఇటీవల టర్కీలో జరిగిన ఇండియన్ ఫుట్‌బాల్ స్కేటింగ్ పోటీల్లో గెలుపొందిన జూనియర్, సీనియర్ క్రీడాకారులను ఎల్బీస్టేడియంలో ఆమె గురువారం అభినందించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ స్కేటింగ్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఖాజాపాషా, కోచ్ మహ్మద్ అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాట్ల శ్రీరాములు జయంతి


ఎస్కే మిశ్రోను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ. రమణాచారి తదితరులు

నాంపల్లి: రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ హైదరాబాద్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చాట్ల శ్రీరాములు 93వ జయంతి వేడుకలను నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారం–2024 ను సినీ దర్శకుడు, ప్రఖ్యాత రంగస్థల నటుడు ఎస్కే మిశ్రోకు ప్రదానం చేశారు. ఆంధ్రానాటక కళా పరిషత్ అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ.రమణాచారి హాజరై పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. నటులు ఉప్పలూరి సుబ్బరాయ శర్మ, చలన చిత్ర రచయిత బుర్రా సాయి మాధవ్, నవ్య వార పత్రిక పూర్వ సంపాదకుడు ఏఎస్.జగన్నాథ శర్మ, రసరంజనీ మాజీ కార్యదర్శి ముట్నూరి కామేశ్వరరావు, రసరంజనీ కార్యదర్శి నటరాజ, కోశాధికారి మోహన్ సేనాపతి, ఉపాధ్యక్షుడు రామకోటీశ్వరరావు హాజరై ప్రసంగించారు. చాట్ల శ్రీరాములు గొప్ప నటులని వారు కొనియాడారు. అనంతరం రసరంజని, ఆంధ్రానాటక కళా పరిషత్ సంయుక్త సహకారంతో అక్కల తామేశ్వరయ్య రచించిన 'నా శత్రువు' నాటకాన్ని వడ్డాది సత్యనారాయణ దర్శకత్వంలో యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి సమర్పణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులకు రూ.50 వేలను పారితోషికం కింద అందజేసి సత్కరించారు.

యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడి ఎన్నిక


రాజు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆర్.రాజు ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినందుకు తనకు ఓటు వేసి గెలిపించినందుకు సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే త్వరలోనే చాంద్రాయణగుట్ట చౌరస్తాలో మెట్రో జంక్షన్ ఏర్పాటవుతుందన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాలతో ఆత్మ సంతృప్తి లభిస్తుందని హైదరాబాద్ అగ్రవాల్ కుంభమేళా, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ అన్నారు. తన కుటుంబసభ్యులతో కలిసి నిరుపేద విద్యార్థులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రియాంక అగర్వాల్, ప్రకార్ అగ్రవాల్, మోహక్ అగర్వాల్, రాఘవేంద్ర, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాల్ దర్వాజా ఆలయ కమిటీ చైర్మన్‌పై పరువు నష్టం దావా

చార్మినార్: ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త ఎల్. గోవింద్ కుమార్ ముదిరాజ్ లాల్ దర్వాజా సింహవాహిని ఆలయ ప్రస్తుత చైర్మన్ సీ రాజేందర్ యాదవ్‌పై రూ.2 కోట్ల పరువు నష్టం దావా వేశారు. తన ఫిర్యాదు మేరకు నాంపల్లిలోని చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కేసు నమోదు చేసి వచ్చే నెల 10న విచారణకు హాజరు కావాలని ఆదేశించినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. ఆలయ స్థలానికి సంబంధించి తాను గతంలో ఫిర్యాదు చేశానని.. దీంతో సంబంధిత రెవెన్యూ అధికారులు చైర్మన్ కు వివరణ కోరుతూ లెటర్ రాశారన్నారు. దీనిపై చైర్మన్ బదులిస్తూ తనను వసూల్ రాజాగా, ఆర్టీఐ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తూ తన పరువుకు నష్టం కలిగించినందుకు కోర్టును ఆశ్రయించినట్లు గోవింద్‌కుమార్ ముదిరాజ్ తెలిపారు.

హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

గౌలిపురా: హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరిని మొఘల్‌పురా పోలీసులు గురువారం అరెస్ట్ చేసి 50 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ ప్రాంతానికి చెందిన షేక్ షాబాజ్ జగదీష్ మార్కెట్‌లో మొబైల్ రిపేర్ వ్యాపారం చేస్తుంటాడు. కాగా షేక్ షాబాజ్ గురువారం స్టేషన్‌పరిధిలోని అబ్దుల్ మాజీద్ అనే వ్యక్తికి హెరాయిన్‌ను విక్రయిస్తున్నాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడి చేసి షేక్ షాబాజ్‌తో పాటు హెరాయిన్‌ను సరఫరా చేస్తున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన మెస్త్రీ జమాల్ మోమీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వైద్యుడు, ఆసుపత్రి యాజమాన్యంపై కేసు

గౌలిపురా: గడువు ముగిసిన సెలైన్ ఎక్కించడంతో వైద్యుడితో పాటు ఆసుపత్రి యాజమాన్యంపై మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురాకు చెందిన సర్ఫరాజ్ హుస్సేన్ (17) అపెండెక్స్ ఆపరేషన్ కోసం గత నెల 29న మొఘల్‌పురాలోని అల్ఫా ఆసుపత్రిలో చేరాడు. ఈ నెల 3న సర్ఫరాజ్ హుస్సేన్‌కు ఆపరేషన్ చేసిన అనంతరం సెలైన్‌ను ఎక్కించారు. కాగా సర్ఫరాజ్‌కు ఎక్కించిన సెలైన్ గత మార్చిలో గడువు ముగిసింది. దీన్ని బాధితుడి కుటుంబ సభ్యులు గమనించారు. మక్సూద్ అలీ వైద్యుడితో పాటు ఆసుపత్రి యాజమాన్యంపై బాధిత కుటుంబ సభ్యులు మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్

యాకుత్‌పురా: బస్తీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. రెయిన్‌బజార్ డివిజన్‌లోని అజ్మత్‌నగర్, మదీనానగర్ ప్రాంతాల్లో నూతనంగా చేపట్టనున్న తాగునీటి పైపులైన్ పనులపై స్థానిక కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, జలమండలి జనరల్ మేనేజర్, పలువురు అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నోఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు శిథిలావస్థకు చేరుకోవడంతో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తున్నాయన్నారు. శాశ్వత పరిష్కారానికే నూతన పైపులైన్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఘంటసాల భావి తరాలకు ఆదర్శప్రాయుడు


చల్లా సుబ్బారాయుడు దంపతులకు బిరుదును ప్రదానం చేస్తున్న కేవీ రమణాచారి

గన్‌ఫౌండ్రీ: ఘంటసాల భావి తరాలకు ఆదర్శప్రాయుడని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. రవీంద్రభారతిలో సంఘం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకొని పరిశోధకుడు చల్లా సుబ్బారాయుడు దంపతులకు ఘంటసాల గాన పరిజ్ఞాన విశారద బిరుదును గురువారం ప్రదానం చేశారు. అంతకుముందు ఘంటసాల సినీ సంగీత విభావరి ఆకట్టుకున్నది. కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, సంగీత దర్శకుడు కేఎం.రాధాకృష్ణన్, సంగమం అధ్యక్షుడు సంజయ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో మొక్కలు నాటిన వైద్యులు


మొక్క నాటిన నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ రవికుమార్ తదితరులు

నాంపల్లి: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పుట్టిన రోజును పురస్కరించుకుని నిలోఫర్ ఆసుపత్రి ఆవరణలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ గురువారం గార్డెన్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, నరేంద్ర నాయక్, స్రవంతి, ఉపేందర్, ప్రొఫెసర్లు విజయ్‌కుమార్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సమగ్ర సర్వే వివరాల నమోదు


నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇందుకోసం తగు ఏర్పాట్లు చేశారు. ప్రతి షిఫ్ట్‌లో 250 మంది కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొనేలా అధికారులు తగు చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలో మొత్తం 87,500 కుటుంబాల సర్వేను చేపట్టారు. సర్వే చేపట్టిన ప్రతి కుటుంబం వివరాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నారు. 12 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కేంద్రాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది సూచనలు, సలహాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రెండు షిఫ్ట్‌లలో ఆపరేటర్లను విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి ఆపరేటర్ నిత్యం 30 దరఖాస్తులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసేలా అవగాహన కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు ఆపరేటర్లకు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. చిన్నపాటి లోటుపాట్లకు సైతం తావివ్వకుండా అన్ని చర్యలు, ఏర్పాట్లు తీసుకున్నామన్నారు. 12 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నామని డీసీ వెల్లడించారు.

బాక్సింగ్ విజేతలకు సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు అందజేసిన ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: నిజాం కళాశాలలో జరిగిన ఇంటర్ కాలేజ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల విజేతలకు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్, ఓయూ సెక్రెటరీ కె.దీప్లా హాజరై గురువారం సర్టిఫికెట్లు మెడల్స్‌ను అందజేసి అభినందించారు. అలాగే విజేతలుగా నిలిచిన ధ్వర్ష్ మహ్మద్ ఉమర్, తపస్వీరాజ్, ఆదిఉమర్, మహ్మద్ బిలాల్, మహ్మద్ మాలిక్, రామ్‌తేజ, మోహన్, అఖిల్, సాయిదినేశ్, ముస్తఫాఅలీఖాన్, కార్తీక్‌తో పాటు పలువురిని సత్కరించారు.

అయ్యప్పస్వాములకు వసతులు కల్పించాలి


పూజలు చేస్తున్న టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: కేరళ ప్రభుత్వం అయ్యప్ప స్వాములకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పించాలని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. బత్తుల రాము యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం జరిగిన అయ్యప్ప మహా పడిపూజలో ఆయన పాల్గొని పూజలు చేసి మాట్లాడారు. కేంద్రం, కేరళ ప్రభుత్వాలు, అయ్యప్ప స్వాముల కోసం సరైన ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో పోల్కం వినయ్‌రాజ్, నాని గురుస్వామి, సందీప్ గురుస్వామి పాల్గొన్నారు

కేంద్రీయ విద్యాలయ హెచ్‌ఎం హఠాన్మరణం


సూర్య నాగేంద్రం (ఫైల్)

చాంద్రాయణగుట్ట: కేంద్రీయ విద్యాలయ బార్కాస్ బ్రాంచ్ (సీఆర్‌పీఎఫ్) హెడ్‌మాస్టర్ సూర్య నాగేంద్రం బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. నిత్యం తమతో కలిసి మెలిసి ఉండే ఆయన అకాల మరణం బాధకరమని వారు కన్నీటి పర్యాంతమయ్యారు.

రోడ్లంతా చెత్తమయం..!



గోల్కొండ: ప్రధాన రహదారులు, చౌరస్తాలు చెత్తమయంగా మారుతున్నాయి. గుడిమల్కాపూర్ మార్కెట్, గోల్కొండ మోతీ దర్వాజతో పాటు టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కనే యథేచ్ఛగా వ్యర్థాల డంపింగ్ చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని వారు కోరుతున్నారు.

పుడమిని సంరక్షించుకోవాలి

ఏజీవర్సిటీ: ప్రపంచ (మృత్తిక) నేల దినోత్సవాన్ని శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ... జీవకోటి మనుగడ కోసం నేలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూమి పరిరక్షణతోనే నీరు, గాలి తద్వారా స్వచ్ఛమైన వాతావరణం నెలకొంటుందని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు నేల పరిరక్షణకు పాటుపడుతూ పుడమిని కాలుష్యం నుంచి కాపాడుకోవాలన్నారు. నేత ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కళాధర్‌బాబు, సీఎస్ఆర్ సంతోషిణి, లావణ్య, నిరోష, మమత, మజ్జిగ శ్రీనివాస్, డాక్టర్ జెన్ని, వేణుగోపాల్, మేఘన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానమే నిజమైంది..

- డబ్బుల కోసం భార్యపై ఒత్తిడి
- తీవ్రంగా కొట్టి చంపిన భర్త

శంషాబాద్: మహిళ అనుమానాస్పద మృతిలో కుటుంబ సభ్యులు అనుమానించినట్లుగా వివాహితది హత్యగా నిర్ధారణ అయ్యింది. పోలీసుల దర్యాప్తుతో పాటు పోస్టుమార్టంలో కూడా ఇదే వెల్లడైనట్లు సమాచారం. మహేశ్వరం మండలం డబిల్‌గూడ గ్రామానికి చెందిన సుమలతను పదేళ్ల కిందట ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన సాయికుమార్‌గౌడ్ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న సాయికుమార్ తన భార్యను పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని ఒత్తిడి చేశాడు. డబ్బులిస్తే ఇల్లు కట్టుకుందామని చెప్పాడు. భార్య కుటుంబ సభ్యులు తామే దగ్గరుండి ఇల్లు కట్టిస్తామని తెలిపారు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఇటీవల భార్య సుమలత ఆరోగ్యపరంగా కొంత ఇబ్బందులు తలెత్తడంతో దానిని అవకాశంగా మలుచుకుని హత్య చేయాలని పథకం వేశాడు. మంగళవారం అర్ధరాత్రి తీవ్రంగా కొట్టడంతో పాటు గొంతునులిమి హత్య చేసి ఉదయం వరకు గుండెపోటుతో మరణించినట్లు బుకాయించాడు. సుమలత ఆరోగ్యం బాగా లేదని తెలిసిన కుటుంబ సభ్యులు తొలుత ఇది నిజమని నమ్మారు. అంత్యక్రియల సమయంలో శరీరంపై కొన్ని దెబ్బలు కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించడంతో పాటు సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తే తానే పథకం ప్రకారం హత్య చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి




నృత్యం చేస్తున్న విద్యార్థులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని స్లేట్ స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి అమర్నాథ్ అన్నారు. రవీంద్రభారతిలో స్లేట్ ది స్కూల్ భౌరంపేట్ శాఖ ఐదో వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమాజంలో యువత చెడిపోతున్న తీరు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వివిధ పేర్లతో కొన్ని పాఠశాలలు తల్లిదండ్రులను మోసం చేస్తున్న తీరు వంటి పలు అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ మీనాకుమారి, వంశీ అమన్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.